
సాక్షి ఒడిశా
బుధవారం । 3 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,82,102
బంగారం	1 గ్రాము 500 మిల్లీ గ్రాములు
వెండి	307 గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



అత్తారింటికి మాబుడి శాంతమ్మ

- భక్తిశ్రద్ధలతో ఘటయాత్ర
- పోటెత్తిన భక్తజన సందోహం

- 8లో



400 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు

- 8లో

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరణ



రాజేంద్ర మింజ్

పర్లాకిమిడి: గజపతి జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజేంద్ర మింజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన ఎంకేసీజీ వైద్య కళాశాల, బరంపురంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా రాజేంద్ర మింజ్ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.

ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలకు శిక్షణ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి, బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఎయిమ్స్–నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి శిక్షణ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీఎస్సీ పారామెడికల్, బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ, జీఎన్‌ఎం, డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వివరించారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఈనెల 5న చంద్రగ్రహణం

భువనేశ్వర్: ఈనెల 5వ తేదీన ఈ ఏడాదిలో తొలి చంద్ర గ్రహణం ఏర్పడనుంది. ఈ ఖగోళ దృశ్యాన్ని రాష్ట్రంలో వీక్షించేందుకు ఔత్సాహికులు టెలిస్కోప్ లేదా బైనాక్యులర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ గ్రహణంలో చంద్రుని తేలికపాటి ఉపరితలంపై భూమి నీడ పడుతుంది. కాబట్టి ఇది ఒక సూక్ష్మ గ్రహణం. సాధారణంగా కంటితో ఈ దృశ్యం చూడలేము అని స్థానిక పఠాణి సామంత ప్లానిటోరియం డిప్యూటీ డైరెక్టర్ శుభేందు పట్నాయక్ తెలిపారు. ఆరోజు రాత్రి 8.45 నుంచి అర్ధరాత్రి 1 గంటల మధ్య భూమి నీడ గుండా చంద్రుని కదలిక ఉంటుంది. రాత్రి 10.52 గంటలకు గరిష్ట గ్రహణం పట్టు బలంగా ఉంటుందని ఆయన వివరించారు. యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, పసిఫిక్, అట్లాంటిక్, హిందూ మహాసముద్రం, అంటార్కిటికా వంటి కొన్ని ప్రాంతాల్లో చంద్రగ్రహణం కొన్ని భాగాలను ప్రత్యక్షంగా తిలకించే అవకాశం ఉంటుంది. సాధారణంగా సూర్యచంద్ర గ్రహణం కంటే చంద్ర గ్రహణం ప్రపంచంలో అత్యధిక ప్రాంతాల్లో ప్రత్యక్షంగా తారస పడుతుందన్నారు.

ప్రిన్సిపాల్‌గా లింగరాజ్ మిశ్రో



లింగరాజ్ మిశ్రోను అభినందిస్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్న మల్కన్‌గిరి కాలేజీ నూతన ప్రిన్సిపాల్‌గా లింగరాజ్ మిశ్రో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 30 సంవత్సరాలుగా ఈ కాలేజీలో ఎకనామిక్స్ బోధిస్తున్నారు. ఇదివరకు అశోక్ కుమార్ సోడంగి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. లింగరాజ్ మిశ్రోకు తోటి అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ప్రతి కార్మికుడి సేవలూ అమూల్యం

భువనేశ్వర్: రైల్వేల ప్రగతిలో ప్రతి కార్మికుడి సేవలూ అమూల్యమని తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ అన్నారు. తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ మంగళవారం ఏర్పాటు చేసిన కార్మిక దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్మిక వర్గానికి సముచిత పనివేళలు కేటాయించడంపై వారి సామాజిక సంక్షేమం ముడిపడి ఉందన్నారు. బహుముఖ అభివృద్ధి, పురోగతికి 8 గంటల పరిమితి పని వేళలు దోహదపడతాయని ఈస్టు కోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెసు వర్గం తెలిపింది. రైల్వే శాఖ గుర్తింపు పొందిన ఈ రెండు సంస్థలు ఖుర్దా రోడ్ ప్రాంతంలో కార్మిక దినోత్సవాలు వేర్వేరుగా నిర్వహించారు. 100 ఏళ్లు పూర్తి చేసుకున్న కార్మిక చట్టం విలువల పరిరక్షణకు కార్మికుల సంక్షేమం ఏకైక సోపానంగా ఈ రెండు వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ (ఈ–కోర్సు) కార్మిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించి ఉద్యోగ విరామం పొందిన పెద్దలను సత్కరించారు. ఉద్యమ పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన కార్మిక నాయకులకు 2 నిమిషాల పాటు మౌనం వహించి సభాముఖంగా శ్రద్ధాంజలి ఘటించారు.

తుఫాన్‌పై అప్రమత్తత అవసరం

- సీఎం నవీన్ పట్నాయక్
- ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో అధికారులతో సమీక్ష
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: మే నెలలో వచ్చే వేసవి తుఫాన్లపై అప్రమత్తంగా ఉండాలని సీఎం నవీన్ పట్నాయక్ సూచించారు. ఈ వేసవిలో మొదటి తుఫాన్ హెచ్చరికలను ఐఎండీ జారీ చేసిన నేపథ్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని అధికారులతో మంగళవారం నిర్వహించారు. ఐఎండీ జారీ చేసిన తుఫాన్ సంకేతంలో రాష్ట్రానికి ముప్పు అంతగా లేకున్నా, ముందస్తు సన్నద్ధత అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. వేసవి తుఫాన్‌లను అంచనా వేయడం సంక్లిష్టమని పేర్కొన్నారు. 2019లో ఫణి తుఫాన్ అకస్మాత్తుగా వచ్చి భారీ నష్టాన్ని కలిగించిందని గుర్తు చేశారు. అందువలన విపత్తులను ఎదుర్కోవడానికి అనుక్షణం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

శూన్య ప్రాణహానిపై దృష్టి

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో శూన్య ప్రాణహానిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం సూచించారు. ఊహాతీతమైన ప్రకృతి విపత్తులను సైతం అవలీలగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధం కావాలన్నారు. మనకు ప్రతీ ప్రాణం విలువైనదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని విభాగాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), ఒడిశా విపత్తు స్పందన దళం (ఒడ్రాఫ్), అగ్నిమాపక దళం ఇతరేతర అనుబంధ వర్గాలు విపత్తు నిర్వహణకు ముందస్తుగా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రమాదకర తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైన చోట షెల్టర్లకు తరలించాలని అధికారులకు చెప్పారు. సహాయ పునరుద్ధరణ, పునర్నిర్మాణం, పునరావాసం కోసం ముందస్తు ప్రణాళికబద్ధంగా అవసరమైన యంత్రాలు, పనిముట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

18 జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు

18 జిల్లాల కలెక్టర్లతో చర్చించి కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేసినట్లు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) సత్యబ్రత్ సాహు తెలిపారు. సైక్లోన్ షెల్టర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 17 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, 20 ఒడ్రాఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. డీజీ సునీల్ బన్సాల్, డవలప్‌మెంట్ కమిషనర్ అను గార్గ్, గ్రామీణాభివృద్ధి–విద్యుత్ శాఖ కార్యదర్శి సంజయ్ సింగ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ అరబింద కుమార్ పాఢి తమ శాఖల సన్నద్ధతను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

తరచూ సమీక్షించాలి

తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ)కి తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇతర తుఫాన్‌ల కంటే వేసవి తుఫానుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో శూన్య ప్రాణహాని విధానాన్ని అవలంభించడంలో విజయం సాధించామన్నారు. నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నామని, సంబంధిత శాఖ సన్నద్ధంగా ఉండాలని కోరినట్లు పేర్కొన్నారు. కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. దాదాపు 1,000 తుఫాన్ సంరక్షణ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పలుచోట్ల పాఠశాలలు సురక్షితమైన ఆశ్రయ కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు.



తుఫాన్ హెచ్చరికలతో భారత వాతావరణ విభాగం జారీ చేసిన చిత్రం

తుఫాన్ అస్పష్టం

ఈనెల 11వ తేదీన బంగాళాఖాతంలో తుఫాన్ వచ్చే అవకాశం ఉంది. ఉభయ అమెరికన్ జీఎఫ్‌ఎస్, యూరోపియన్ ఈసీఎండబ్ల్యూఎఫ్ వాతావరణ పరిశోధన వర్గాలు ఈ మేరకు ముందస్తు సమాచారం అందజేశాయి. అయితే తుఫాన్ అభివృద్ధి ఇంకా అస్పష్టంగా ఉన్నట్లు ఈ వర్గాలు పేర్కొన్నాయి. తుఫాన్ సాధ్యాసాధ్యాలపై వాతావరణ వర్గాలు దృష్టి సారించి ఉన్నాయి. గతేడాది మే 8న బంగాళాఖాతంలో 'ఆసాని' తుఫాన్ ఏర్పడింది. ఈ తుఫాన్ అల్ప పీడనంగా మారి ఆంధ్రా తీరాన్ని దాటింది. రానున్న తుఫాన్‌ను మోచాగా నామకరణం చేసినట్లు తెలుస్తోంది.

గంజాయి మాఫియాపై ఉక్కుపాదం

- వ్యాపారుల ఆస్తులను జప్తు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుశ్రీ

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో గంజాయి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిరంతరం నిఘా పెడుతున్నా వ్యాపారుల ఆగడాలు ఆగడం లేదు. దీంతో పోలీసు అధికారులు గంజాయి మాఫియాలో భాగమైన వ్యక్తులపై ఉక్కుపాదం మోపారు. గంజాయి మాఫియా ఆస్తుల జప్తుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా జిల్లాలో ఇద్దరు గంజాయి మాఫియా వ్యక్తుల స్థిర, చరాస్తులను సీజ్ చేసినట్లు నవరంగపూర్ ఎస్పీ ఎస్.సుశ్రీ బుధవారం తెలియజేశారు. అలాగే వారి బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్లు వెల్లడించారు. ఉమ్మరకోట్ సమితి చికలపాదర్ గ్రామానికి చెందిన దినేష్ బిశ్వాల్, బుర్జా గ్రామానికి చెందిన దినేష్ భొత్రాల రూ.41.41 లక్షల విలువైన ఆస్తులు సీజ్ చేయడం జరిగిందన్నారు. వారిపై ఉమ్మరకోట్ పోలీసుస్టేషన్‌లో మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉన్నాయని, వారి ఆస్తుల వివరాల కోసం పోలీసులు ఇన్‌కం టాక్స్, తహసీల్దార్ కార్యాలయం, వివిధ బ్యాంకుల్లో ఉన్న వారి అకౌంట్ల వివరాలను సేకరించినట్లు వెల్లడించారు. గతంలోనూ నవరంగపూర్ జిల్లా పోలీసులు 2020లో కొశాగుమడ సమితి పొనరగుడ గ్రామంలో గంజాయి మాఫియాకు చెందిన ముగ్గురు వ్యక్తుల రూ.4.77 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా 2022లో ఉమ్మరకోట్ పోలీసుస్టేషన్ పరిధి బి.ఎస్.పొదర్ గ్రామానికి చెందిన వ్యక్తుల రూ.కోటి ఆస్తులను జప్తు చేసిన విషయాన్ని తెలియజేశారు. ఇటువంటి చర్యల వలన గంజాయి మాఫియాను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు.

హత్య కేసులో ఐదుగురు అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితులు

జయపురం: గత నెల 26వ తేదీన జయపురం పట్టణ పరిధిలోని కొత్తవీధి నాలుగో లైన్‌లో ఉంటున్న అరుణ అనకా అనే యువకుడి హత్య కేసులో ఐదుగురు నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి సంబిత్ బెహర మంగళవారం వెల్లడించారు. వారి నుంచి రెండు కత్తులు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరోజు సాయంత్రం అరుణ అనక సమీప మైదానంలో వాలీబాల్ ఆడేందుకు వెళ్లగా రాత్రి 7.30 గంటల సమయంలో ఏడుగురు వ్యక్తులు దాడికి తెగబడ్డారు. దీంతో అతను ప్రాణభయంతో పరుగులు తీయగా, కత్తులు, మారణాయుధాలతో వెంటాడి నరికి చంపారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు 5గురు నిందితులను పట్టుకున్నారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. అరెస్టైనవారిలో రామ నాయిక్(19), అరుణ భాగ్ (26), అభిషేక్ మాలి(21), కపిలేష్ మంగలి(18), రేమంత బిశాయి(22)లు ఉన్నట్లు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న కత్తులు

రేపటి నుంచి రాష్ట్రపతి పర్యటన

- పుట్టిన ఊరు, అత్తవారి ఊరు సందర్శన
- సిమిలిపాల్ అభయారణ్యంలో బస



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



రాష్ట్రపతి సందర్శించనున్న సిమిలిపాల్ అభయారణ్యం జాతీయ పార్కులో వన్య ప్రాణుల స్వేచ్ఛా విహారం



భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. భారత రాష్ట్రపతి హోదాలో ద్రౌపది ముర్ము వరుసగా మూడోసారి రాష్ట్రానికి వస్తున్నారు. ఈనెల 4వ తేదీ నుంచి పర్యటన ప్రారంభం అవుతుంది. దేశ అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఆమె జన్మస్థలాన్ని(రాయ్‌రంగ్‌పూర్) సందర్శించనున్నారు. ఈసారి ఆమె భువనేశ్వర్ రావడం లేదు.

పర్యటన ఇలా...

ఈనెల 4వ తేదీన కలైకుండ విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి ప్రత్యేక ఛాపర్‌లో మయూర్‌భంజ్ జిల్లా చేరుతారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి మయూర్‌భంజ్ జిల్లా రాయ్‌రంగ్‌పూర్, పహడ్‌పూర్, బరిపదలను సందర్శిస్తారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. అనంతరం 5వ తేదీన సిమిలిపాల్ అభయారణ్యం సందర్శించనున్నారు. 6వ తేదీన బరిపదలో మహారాజా శ్రీరామ్ భంజ్‌దేవ్ విశ్వ విద్యాలయం 12వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన అనంతరం బరిపద నుంచి కలైకుండ విమానాశ్రయానికి బయల్దేరుతారు.

మెట్టినింటి సందర్శన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 4వ తేదీన అత్తగారి (మెట్టినిల్లు) గ్రామమైన పహడ్‌పూర్‌ని సందర్శిస్తారు. రాయ్‌రంగ్‌పూర్‌లోని బంగ్లాలో రాత్రి బస చేయడానికి ముందు పలు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. 5వ తేదీన ఆమె పండిట్ రఘునాథ్ ముర్ము స్వగ్రామం, దండ్‌బోష్, సిమిలిపాల్ నేషనల్ పార్క్‌లను సందర్శిస్తారు.

అభయారణ్యంలో రాత్రి బస

సిమిలిపాల్ అభయారణ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 4వ తేదీ రాత్రి బస చేస్తారు. అభయారణ్యం సందర్శనలో భాగంగా జంగిల్ సవారీలో పాల్గొంటారు. అటవీ శాఖ అధికారులు సవారీకి కావాలసిన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో 4, 5 తేదీల్లో వరుసగా 2 రోజుల పాటు సాధారణ సందర్శకులు రాకుండా సిమిలిపాల్ టైగర్ రిజర్వ్‌ను మూసివేస్తున్నట్లు ఫీల్డ్ డైరెక్టర్ కమ్ రీజినల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సు (ఆర్‌సీసీఎఫ్) ప్రకటించారు. 2,750 కి.మీ విస్తీర్ణంలో ఉన్న సిమిలిపాల్ పులుల అభయారణ్యం జాతీయ పార్క్‌ను తొలిసారిగా భారత రాష్ట్రపతి సందర్శించనున్నారు. ఆమె రోజంతా అభయారణ్యంలోనే గడిపే అవకాశం ఉంది. రాష్ట్రపతి తొలిసారిగా సిమిలిపాల్‌కు వస్తున్నందున అధికారులు ప్రొటోకాల్ ప్రకారం అత్యంత బందోబస్తు, అతిథి సత్కారాలు, ఇతర ఏర్పాట్లు చేశారు. సిమిలిపాల్ పర్యటన అనంతరం మరుసటి రోజు 6వ తేదీన మహారాజా శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తారు. ఈ ప్రాంగణంలో శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విగ్రహానికి రాష్ట్రపతి నివాళులర్పిస్తారు. అనంతరం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 12.15 గంటలకు క్యాంపస్ నుంచి బయలుదేరి తిరిగి ఢిల్లీకి చేరుకుంటారని అనుబంధ వర్గాలు తెలిపాయి.

8వ రోజుకు చేరిన రిలే దీక్ష



కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన విద్యార్థిని సౌదామిని రైతో (15) అనుమానాస్పద మృతిపై క్రైమ్ బ్రాంచితో సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె తల్లి సుజ్ఞాణి గోమాంగో చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి 8వ రోజుకు చేరింది. అయితే అధికారులెవరూ ఇంతవరకు మృతురాలి కుటుంబ సభ్యులతో ఎటువంటి సంప్రదింపులు జరపకపోవడంతో కాశీనగర్ వల్లాడ గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినిది ఆత్మహత్య కాదని, హాస్టల్ అధికారులే చంపేసి ఉంటారని ఆమె తల్లి ఆరోపిస్తోంది. మృతురాలి చెల్లెలు అదే విద్యాలయంలో ఏడో తరగతి చదువుతుండడంతో టీసీ తీసుకొని బయటకు వచ్చి వేరే పాఠశాలలో అడ్మిషన్ కోసం వెదుకుతోంది. అయితే రైతో ఉదంతంతో పర్లాకిమిడిలో ఏ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు ఆమెను చేర్చుకోవడం లేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

- ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. 4వ వార్డు అప్పర కొలాబ్ ప్రాజెక్టు ఇరిగేషన్ కాలనీలో పార్క్‌ను ప్రారంభించారు. అలాగే 2వ వార్డులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ప్రారంభించారు. జయనగర్‌లో మిని చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ స్పేస్ పార్క్‌లను వార్డు ప్రజలకు అంకితం చేశారు. 19వ వార్డులో మిని చిల్డ్రన్ పార్క్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొరాపుట్ జిల్లాలో ప్రధాన పట్టణమైన జయపురం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ కౌన్సిల్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో జయపురం సబ్ కలెక్టర్ బేధబర ప్రధాన్, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పెర్సన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అత్తారింటికి మాబుడి శాంతమ్మ

- భక్తిశ్రద్ధలతో ఘటయాత్ర
- పోటెత్తిన భక్తజన సందోహం

రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహిస్తున్న బరంపురం గ్రామ దేవత మాబుడి శాంతమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నిజ మందిరమైన అత్తవారింటికి చేరుకున్నారు. గత నెల రోజులుగా స్థానిక దేశి బెహరా వీధిలోని పుట్టినిళ్లు పాతర్ల దుర్గా ప్రసాద్ దేశి బెహరా ఇంటిలో అమ్మవారి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి పాతర్ల దుర్గా ప్రసాద్ దేశి బెహరా ఆధ్వర్యంలో వేద పండితులు వేమగోటి వాసుదేవ్ శాస్త్రి నిర్ణయించిన ముహూర్తం ప్రకారం పురోహితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి పుట్టినింటి సారె సమర్పించారు. తాత్కాలిక మందిరమైన పుట్టినింటి నుంచి అత్తవారింటికి ఘటయాత్ర కొనసాగింది. అనంతరం మంగళవారం ఉదయం 3.00 గంటల సమయంలో ఆలయ గర్భగుడి శక్తిపీఠంపై అమ్మవారు కొలువయ్యారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక ఏకాంత సేవలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. – బరంపురం


అమ్మవారికి పుట్టింటి సారె సమర్పిస్తున్న దృశ్యం


అత్తారింటికి ప్రారంభమైన యాత్ర


కళశాలతో యాత్రలో పాల్గొన్న మహిళలు


నిజ మందిరానికి బయల్దేరిన అమ్మవారి యాత్రలో పాల్గొన్న భక్తజన సందోహం


మా బుడి శాంతమ్మ ముందు భక్తుల ఘటాలు

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన డీఎస్పీ


ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శృతి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం సబ్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.శృతి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని శాంతిభద్రతలు తదితర అంశాలపై ఎస్పీతో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: టెక్కలి డీఎల్‌పీఓ కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ గొడ దేవరాజ్(43) మంగళవారం మృతిచెందారు. మెళియాపుట్టి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న మెళియాపుట్టి మండలం పూలసార గ్రామానికి వెళ్లిన దేవరాజ్.. అక్కడి నుంచి జాడుపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కుక్క అడ్డు రావడంతో బండి అదుపు తప్పి బోల్తాపడ్డారు. తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కాగా, దేవరాజును గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈయనకు భార్య రున్నూ, పిల్లలు గాయత్రి, కిరణ్ ఉన్నారు.

నీలమణిదుర్గకు వెండి కిరీటం బహూకరణ


కిరీటం అందజేస్తున్న దాతలు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి సారవకోట మండలం మాకువ గ్రామానికి చెందిన సిరిపురం అప్పలనాయుడు కుమారులు నరసరావు, దిలీప్‌లు వెంటి కిరీటాన్ని మంగళవారం బహూకరించారు. ఈ కిరీటం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వాసుదేవరావు, కమిటీ సభ్యులు కృష్ణారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓతో ఫీల్డ్ అసిస్టెంట్ల వాగ్వాదం


ఎంపీడీఓ ఉమాసుందరితో వాగ్వాదానికి దిగిన ఎఫ్ఏలు

సంతబొమ్మాళి: 'మా మీద ఎందుకు ఇష్యూ చేస్తున్నారు.. కావాలనే ఇరికించాలని చూస్తున్నారు..' అంటూ ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీలపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బి.రామారావు, నీలాపు ప్రసాద్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. 'ఒక్క రోజు పనిచేయకుండా..' అనే కథనం సాక్షిలో మంగళవారం ప్రచురితం కావడంతో నౌపడ సచివాలయానికి ఎంపీడీఓ ఉమాసుందరి, ఏపీఓ వాసునాయుడు విచారణ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్ఏలు మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగం చేసుకొని ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడాల్సిన అవసరం లేదన్నారు. దీంతో అక్కడ ఉన్న సచివాలయ సిబ్బంది ఎఫ్ఏలను బతిమలాడడంతో విచారణకు సహకరించారు. నెలకు రూ.12 వేలు జీతం తీసుకొని ఉపాధి పని చేస్తున్నట్లు మస్టర్లు ఎలా వేసుకుంటున్నావని ఎఫ్ఏ ప్రసాద్‌రెడ్డిని ఎంపీడీఓ ప్రశ్నించారు. మీకు డబ్బులే కావాలని.. ఉద్యోగం అంటే భయం లేదని మండిపడ్డారు. అనంతరం లిఖితపూర్వకంగా లేఖ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి


నౌపడ రవికుమార్ మృతదేహం

కోటబొమ్మాళి: సారవకోట మండల కేంద్రానికి చెందిన నౌపడ చిన్నారావు కుమారుడు నౌపడ రవికుమార్ (29) మంగళవారం రైలు కింద పడి మృతి చెందాడు. తిలారు రైల్వేస్టేషన్ రైల్వే గేట్ సమీపంలో మధ్యాహ్నం 2.30 సమయంలో బెంగళూరు-భువనేశ్వర్ స్పెషల్ ట్రైన్ రవికుమార్‌ను ఢీకొట్టింది. మృతికి గల కారణాలు తెలియలేదు. రవికుమార్ ప్రస్తుతం పాన్‌షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఫుట్‌బాల్ విజేతకు సీఎం అభినందనలు


జట్టును అభినందిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ జట్టు తొలిసారిగా గెలిచిన సూపర్ కప్ ట్రోఫీతో సీఎం నవీన్ పట్నాయక్‌ను మంగళవారం కలిసింది. జట్టు అధినేత రాజ్ అథ్వాల్, హెడ్ కోచ్ క్లిఫోర్డ్ మిరాండా, క్రీడాకారులు అమ్రీందర్ సింగ్, శుభమ్ సారంగి, క్లబ్ జనరల్ మేనేజర్ అభిక్ ఛటర్జీ, క్లబ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అమృత్ పట్టోజోషి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ జట్టులో ప్రతి ఒక్కరి అద్భుతమైన ప్రదర్శనను అభినందించారు. క్రీడాకారుల అత్యుత్తమ ప్రదర్శనతో జట్టుకు విజయం చేకూరిందన్నారు.

400 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు 400 కిలోల గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంజాయి రవాణాకు సంబంధించి ముందస్తుగా అందిన సమాచారం మేరకు పద్మపూర్ సమీపంలోని దుములపదర్ కూడలిలో పోలీసులు వాహన తనికీలు నిర్వహించారు. ఈ క్రమంలో గజపతి జిల్లా ఒడవ ప్రాంతం నుంచి వస్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీలు చేపట్టగా, అందులో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించి పంజాబ్ రాష్ట్రం పుతేఘల్ జిల్లా శిరిహింద్ పోలీసుస్టేషన్ పరిధిలోని తర్కనమజ్రా గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ బహదూర్ సింగ్ (47), అదే ప్రాంతానికి చెందిన హెల్పర్ బాల్‌రాజ్ సింగ్ (48)లను పోలీసులు అరెస్టు చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు చెందిన రాజమండ్రికి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందన్నారు.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు



సీజ్ చేసిన పికప్ వ్యాన్

సిక్కోలు గ్రామీణానికి..
గుర్తింపు యోగం





- సిక్కోలు పల్లెలకు జాతీయ స్థాయి గుర్తింపు
- ఉత్తమ గ్రామీణ పర్యాటక అవార్డుల రేసులో నాలుగు గ్రామాలు
- ప్రతిపాదిత జాబితాలో కూర్మ, పొందూరు, బుడితి, బెజ్జిపురం గ్రామాలు
- జిల్లా అధికారుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సిక్కోలు పల్లెలు జాతీయ స్థాయి గుర్తింపునకు నోచుకుంటున్నాయి. జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం మన జిల్లాకు చెందిన నాలుగు గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి కేంద్ర పర్యాటక శాఖకు నివేదించింది. వాస్తవంగా మూడు ఉత్తమ పర్యాటక గ్రామాలను ఎంపిక చేసి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత కోరినా... ఆ తర్వాత మరో గ్రామీణ పర్యాటక ప్రదేశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి వెళ్లిన ప్రతిపాదనల్లో అత్యధికంగా మన జిల్లాకు చెందినవే కేంద్ర పర్యాటక శాఖకు సిఫార్సు చేయడం గమనార్హం.

దేశ వ్యాప్తంగా గ్రామీణ పర్యాటక ప్రదేశాల కోసం అవార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మన జిల్లా నుంచి నాలుగు గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేసి కేంద్రానికి సిఫార్సు చేశారు. గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పాటు దేశ నలుమూలలా వీటి ఖ్యాతిని తెలియజేయాలన్న ఆలోచనలో భాగంగా కేంద్రం ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేస్తోంది. మన జిల్లా నుంచి పొందూరు, బుడితి, కూర్మ, బెజ్జిపురం గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.

కొత్త ఆకర్షణ.. కూర్మ గ్రామం

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగానికి సుమారు ఆరు కిలోమీటర్లు దూరంలో హిరమండలంలో ఉన్న అతి చిన్న కుగ్రామంగా 2019లో ప్రపంచానికి పరిచయమైన కూర్మ గ్రామం ఇప్పుడు అందరి దృష్టిలో పడింది.

- రోజురోజుకి అక్కడి వెళ్తున్న పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. దానికి దగ్గరలోనే హిరమండలం రిజర్వాయర్, శ్రీముఖలింగం పుణ్య క్షేత్రం ఉండటంతో ఆ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువైంది.
- అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంస్థాన ఆచార్యులు భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల ఆదేశాలతో భక్తి వికాస్ స్వామి సారథ్యంలో 2018 జూలైలో కూర్మ గ్రామాన్ని నిర్మించారు.
- గ్రామంలో 56 మంది నివాసముంటున్నారు. 12 కుటుంబాలు, 16 మంది విద్యార్థులు, ఆరుగురు బ్రహ్మచారులు నివసిస్తున్న ఈ గ్రామం ఆధునిక పద్ధతులకు దూరంగా ఉంది. ఈ కారణంగానే అక్కడికి పర్యాటకుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.
- అధికారిక లెక్కల ప్రకారం ఏటా కొత్తగా 35,891మంది ఇక్కడికి వస్తున్నారు. ఇప్పుడీ గ్రామాన్ని జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం ప్రభుత్వం సిఫార్సు చేసింది.

బెజ్జిపురం మెరిసేలా..



జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం బెజ్జిపురం గ్రామాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది. జ్యూట్ ఉత్పత్తులతో పాటు పక్కనే పొందూరు ఖాదీ పరిశ్రమ ఉండటంతో ఇక్కడికి కూడా పర్యాటకులు అధికంగానే వస్తున్నారు. ఏటా 55,822 మంది ఇక్కడికి విచ్చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బెజ్జిపురం గ్రామాన్ని కూడా జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల సిఫార్సుల జాబితాలో చోటు కల్పించారు.





సిక్కోలు కీర్తి.. పొందూరు ఖ్యాతి..





పొందూరు ఖాదీ అంటే ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. స్వాతంత్ర్య ఉద్యమం దగ్గరి నుంచి నేటి వరకు దానికున్న ప్రాధాన్యత ఎంత చెప్పినా తక్కువే. దగ్గరలోనే మడ్డువలస రిజర్వాయర్ కూడా ఉండటంతో అక్కడికొచ్చే పర్యాటకుల సంఖ్య బాగా పెరుగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఏటా 2.25లక్షల మంది సందర్శిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖ వ్యక్తులు వచ్చి పొందూరు ఖాదీని సందర్శిరచి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఖాదీకి ప్రత్యేకతే కాదు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. ఇటలీ, జర్మనీ, కెనడా, యూఎస్ఏ, నార్వే, థాయ్‌లాండ్ దేశాల నుంచి గ్రాడ్యుయేట్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు, ప్రముఖులు సందర్శిస్తున్నారు. పంజాబ్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు వచ్చి ప్రాజెక్టులను తయారు చేశారు. ఖాదీ పరిశ్రమలో సరికొత్త పోకడలకు సంబంధించి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫాషన్ టెక్నాలజీ(నిఫ్ట్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) విద్యార్థులు పొందూరును సందర్శించారు. ఇక్కడ వస్త్ర నమూనాలను పరిశీలించి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, భోపాల్, గాంధీనగర్, కన్నూర్, కోల్‌కతా, ముంబై, పుణే, కంగరా, భువనేశ్వర్‌లలో తమ విద్యార్థులకు డిజైనింగ్ తదితర ప్రక్రియల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా తదితర చోట్ల నెలకొని ఉన్న వస్త్ర పరిశ్రమల యూనిట్లలో ఉద్యోగాలు పొందుతున్నారు. దేశ వ్యాప్తంగా వ్యాపారం సాగిస్తున్న ఖాదీ వస్త్రాల డిమాండ్‌తో పొందూరు పేరు మార్మోగుతోంది. ఇప్పుడీ గ్రామం గ్రామీణ ఉత్తమ పర్యాటక ప్రదేశంగా జాతీయ స్థాయిలో ఎంపిక అవుతుందన్న ఉద్దేశంతో మన ప్రభుత్వం సిఫార్సు చేసింది.

బుడితి కంచు మోగాలి..





150 ఏళ్ల చరిత్ర గల బుడితి గ్రామం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం వచ్చింది. ఇత్తడి వస్తువుల తయారీలో పేరుగాంచిన బుడితి గ్రామానికి వచ్చే పర్యాటకుల సంఖ్య ఎక్కువగానే ఉంది. అధికారుల లెక్కల ప్రకారం ఏటా 25,456 మంది ఇక్కడికి వస్తున్నారు. జిల్లాలోని సారవకోట మండలం బుడితి గ్రామంలో తయారవుతున్న ఇత్తడి వస్తువులు నాణ్యతతో పాటు అందంలో కూడా ప్రసిద్ధిగాంచాయి. ఇక్కడ తయారయ్యే దేవతా విగ్రహాలకు రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ లభిస్తోంది. 7వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో బుడితి ప్రస్తావన ఉంది. లేపాక్షి ఆర్డర్లపై వస్తువులు తయారీ వరకు బుడితి ఖ్యాతి చేరింది. అందుకనే గ్రామీణ ఉత్తమ పర్యాటక పోటీలకు బుడితి గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.

తెప్పలకు ఆదర్శ స్వర్ణ నంది పురస్కారం

కాశీబుగ్గ: పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ఆదర్శ స్వర్ణ నంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికపై ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన ఆదర్శ ఐరావతం, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. రచయితగా, నటుడిగా, లయన్స్ సభ్యునిగా సమాజ సేవకునిగా, విద్యావేత్తగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నందుకుగాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అనుబంధ సేవా సంస్థల అధ్యక్షులు అప్పారావు, వెంకటాచలం, చిన్నచారి, రుద్రమూర్తి, ఉత్తరావల్లి నాగేశ్వరరావు తదితరులు కృష్ణమూర్తికి అభినందించారు.

6న పౌరాణిక ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 6న శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పలు పౌరాణిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామాంజనేయం(యుద్ధం సీను), కురుక్షేత్రం(పాండవ సీను), గయోపాఖ్యానం (యుద్ధం సీను), సత్యహరిశ్చంద్ర (వారణాసి సీను) ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పౌరాణిక కళాకారిణి కె.వి.పద్మావతికి 'నట గాయ మంజరి' బిరుదు, బి.ఎ.ఎ.మోహనరావు, మిత్రుల సహకారంతో 'రజిత మకుటం' బహూకరించనున్నట్లు తెలిపారు.

'న్యాయమే గెలిచింది'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 2016 జనవరి 31న జరిగిన కాపు ఐక్యగర్జన సందర్భంగా దహనమైన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ కుట్ర కేసులో కాపులను బలిపశువులను చేస్తూ అనేక సెక్షన్ల కింద నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేయడం పట్ల శ్రీకాకుళం జిల్లాలో తెలగ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాపునాడు ఉపాధ్యక్షుడు ద్వారపు అజిత్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు న్యాయం జరుగుతోందని తెలగ సంఘం నాయకులు పిల్లల రామకృష్ణారావు, సిద్దా జగదీష్ కుదిరెల్ల అప్పారావు, నంది సూర్య ప్రకాష్, కొండా రామారావు, డబ్బీరి దివాకర్, ఎం.రాంబాబు, దేవిరెడ్డి వీరబాబు, రొక్కం వేంకటేశ్వరరావు తదితరులు పేర్కొన్నారు.

కొత్తూరులో సైబర్‌మోసం

కొత్తూరు: మండలం కేంద్రం కొత్తూరుకు చెందిన సారిపల్లి హరికృష్ణ సైబర్ మోసానికి గురై రూ.1,94,000 నష్టపోయాడు. ఈయన సెల్‌ఫోన్‌కు గత నెల 27న ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. పార్ట్‌టైం జాబ్ కావాలంటే అందులో సూచించిన టెలీగ్రామ్ లింక్‌ను క్లిక్ చేయాలని చెప్పారు. మొదటి టాస్క్‌లో రూ.2000 చెల్లించగా ఖాతాకు రూ.2800 జమ చేశారు.

తర్వాత మూడు టాస్క్‌లలో డబ్బులు చెల్లించినా తిరిగి జమ చేయకపోవడంతో నష్టపోయినట్లు బాధితుడు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

30 మద్యం బాటిల్స్ పట్టివేత


అరెస్టయిన మద్యం బాటిల్స్ రవాణా చేస్తున్న వ్యక్తి

చీపురుపల్లి: అక్రమంగా రవాణా చేస్తున్న 30 మద్యం బాటిల్స్ సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు చెప్పారు. పట్టణంలో నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ప్రధాన రహదారిలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా మద్యం బాటిల్స్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న అలజంగి గ్రామానికి చెందిన కొలుసు తులసిని అదుపులోకి తీసుకుని బాటిల్స్ సీజ్ చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా మద్యం రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జామి: మండలకేంద్రం జామిలో గుర్తు తెలియని వ్యక్తి(55) మంగళవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక జెడ్పీఉన్నతపాఠశాల ఎదురుగా ఉన్న షాపు బయట వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు చూసి పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి ఆరాతీశారు. వీఆర్వో వైవీ ప్రతాప్ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మండల పరిసర ప్రాంతాల్లో వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ సామగ్రి సేకరిస్తూ పాత సామగ్రి కొనేవారికి విక్రయించేవాడు. మద్యానికి బానిసైన ఆ వ్యక్తి మద్యం తాగి తాగునీరు లేక సోమవారం రాత్రి మృతిచెంది ఉంటాడని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ నిర్వహిస్తామని, మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని హెచ్‌సీ ఆర్.మోహనరావు కోరారు.

ఘనంగా పాదాలమ్మ ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


పాదలమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన పాదాలమ్మను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దర్శించుకున్నారు. పాదాలమ్మ వార్షిక మహోత్సవాలలో భాగంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులు అమ్మవారిని మంగళవారం కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని గద్దెకు తెచ్చి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు, వజ్రపు శ్రీనువాసురావు మాట్లాడుతూ ఎంతో సత్యవంతమైన తల్లిగా పాదాలమ్మ పూల్ బాగ్ ప్రాంతంలో వెలసిందని అన్నారు. 38 సంవత్సరాలుగా ప్రతి ఏటా పాదాలమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వేముల రాంప్రసాద్, జీకే శ్రీను, మిర్తిపాటి అప్పన్న, సిద్ధాబత్తుల జగదీశ్వరరావు, మొండి నారాయణ, కొవ్వూరు సన్యాసిరావు, మెండా రమణ పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు స్పందన

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 100 మందికి నిరుద్యోగ యువత పాల్గొనగా వారికి రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం వారికి పలు ఫార్మా, ఇతర కంపెనీల్లో ఉపాధి అవకాశాలకు ఎంపిక చేశారు.

7న కార్బన్ క్రెడిట్ సేవలపై సదస్సు

విజయనగరం ఫోర్ట్: నెల్లిమర్ల మండలం రామతీర్థంలో ఆదర్శ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 7న కార్బన్ క్రెడిట్ సేవలపై 100 మంది రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షురాలు సబ్బి నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జి.కె.ఎఫ్ అధినేత బాషా ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

ఘనంగా అసిరితల్లికి పూజలు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పూసపాటిరేగలో అసిరితల్లి అమ్మవారు పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అసిరితల్లి, బంగారమ్మ, దేశమ్మ, చంద్రమ్మ, పోలిపిల్లి, పైడితల్లి, కంచమ్మ అమ్మవార్లకు పూసపాటిరేగ గ్రామస్తులు పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. గ్రామంలో ఘటాలతో పూజారి ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రా..!

- క్రీడాశిక్షణలతో కళకళలాడుతున్న మైదానాలు
- జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఉచిత శిబిరాలు
- ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున నిధుల కేటాయింపు


డీఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో చిన్నారుల సందడి

విజయనగరం: పుస్తకాలతో కుస్తీపట్టి..పరీక్షలు రాసి హాయిగా ఊపిరి పీల్చుకున్న పిల్లలు..విద్యార్థులు ప్రస్తుతం క్రీడామైదానాల్లో సందడి చేస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో ఈ శిబిరాలు నిర్వహించనుండగా..ఒక్కో శిబిరానికి రూ.7వేలు చొప్పున జిల్లాకు సంబంధించి రూ.3.50 లక్షలు లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు డీఎస్ఏ అధికారులు తెలిపారు. ఫుట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్, చెస్, కరాటే, బాక్సింగ్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్, జూడో, నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, స్కేటింగ్, షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తుండగా..వాటిని నేర్చుకునేందుకు వచ్చే క్రీడాకారులతో క్రీడామైదానాలు కళకళలాడుతున్నాయి. ఆన్‌లైన్ విధానంలో తరగతులు కొనసాగినప్పుడు సెల్‌ఫోన్‌లకు అలవాటుపడిన విద్యార్థులకు..వాటిపై దృష్టి తగ్గించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. వేసవి క్రీడా శిబిరాలను విజయవంతం చేసేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిపుణులైన శిక్షకులను నియమించింది. ఒకే క్రీడాంశంలో శిక్షణ కోసం వందల మంది విద్యార్థులు వచ్చినా..అందరికీ అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో ఆదరణ ఉన్న కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాక్సింగ్, తైక్వాండో, బాల్ బ్యాడ్మింటన్ ఆడేందుకు ఆసక్తి కనబరుస్తుండగా.. ఆయా క్రీడాంశాల్లో ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

ఆటల వల్ల సమయ పాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవాటు అవుతాయి. ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారుడిగా రాణించవచ్చు. సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టు సాధించే అవకాశం. క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగం పొందే అవకాశం ఉంటుంది. అండర్-14 బాలబాలికలు క్రీడా శిబిరాలు వినియోగించుకోవాలని క్రీడా శాఖ అధికారులు కోరుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచిస్తున్నారు.

ఆటతో అభ్యసనం

పిల్లల్లో ఆటలు సమన్వయ, ఆలోచన, సామాజిక అవగాహన, భాషా నైపుణ్యాలతోపాటు సమగ్ర వికాసం పెంపొందిస్తాయి. మైదానంలో ఏ చోట ఏ ఆట ఆడుకోవాలనే దానిపై సొంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల స్వేచ్ఛగా వ్యవహరించే తీరు అలవడుతుంది. సహజ స్వభావం తెలుస్తుంది.

రోజులో 60 నిమిషాలు శారీరక శ్రమ అవసరం

పిల్లలకు రోజులో 60 నిమిషాల శారీరక శ్రమ అవసరమని నిపుణులు చెబుతున్నారు. క్రీడల వల్ల కండరాలు బలపడతాయి. శ్వాస, రక్త ప్రసరణ పనితీరు, రోగనిరోధక శక్తి మెరుగుపడతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులు దరిచేరవు. చురుకుదనం, వేగం, బలం, సమతౌల్యం మెరుగుపడి చదువులో రాణించడానికి దోహదం చేస్తాయి. ఆట వారిలో ఊహా శక్తిని పెంచుతుంది. క్రీడలో గెలవడానికి ఎత్తులు వేయడం తెలుస్తుంది. ప్రకృతిలో విషయాలను పరిశీలిస్తూ ఉండడం వల్ల మనసులో మెదిలే ఆలోచనలతో సృజనాత్మక నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

– బి.రాంగోపాల్, సీఈఓ, సెట్విజ్, విజయనగరం

సామాజిక ప్రవర్తన మెరుగు

ఈ కాలం పిల్లల్లో సామాజిక ప్రవర్తన లోపించడం ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని అధిగమించడానికి ఆటలు బాగా తోడ్పతాయి. మైదానంలోకి చాలా మంది పిల్లలు వస్తుంటారు. వారితో క్రమంగా మాట్లాడడం, ఆటలో భాగస్వాములవడంతో స్నేహం పెంచుకుంటారు. ఇతరులతో ఎలా ప్రవర్తించాలో నేర్చుకుంటారు. నలుగురిలో కలిసిపోవడం, బహిరంగ ప్రదేశాల్లో అనుసరించాల్సిన విధానం, సహనంగా మెలగడం, సమస్యలను పరిష్కరించడం, బిడియాన్ని అధిగమించడం, వైవిధ్య వాతావరణానికి అలవాటు పడడం వంటి ప్రత్యేక నైపుణ్యాలు అలవర్చుకుంటారు. భావోద్వేగాల నియంత్రణకు ఆటలు చక్కటి సాధనంగా పనిచేస్తాయి.

పైడితల్లికి పుష్పాలంకరణ


ప్రత్యేక అలంకరణలో పైడి తల్లి అమ్మవారు


దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారు మంగళవారం నుంచి ఉయ్యాల కంబాల మహోత్సవం వరకూ చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, మూలా పాపారావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలు, స్వీట్లు, మామిడి పండ్లు నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

మే 9 నుంచి జగనన్నకు చెబుదాం

- కలెక్టర్ నిషాంత్ కుమార్



వీడియోకాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం మే 9వ తేదీన ప్రారంభం అవుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో 1902 నంబరు కాల్ సెంటర్ పనిచేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి ఆడిట్ టీమ్‌లను ఏర్పాటు చేశారని, ప్రతి ఆర్జీని కాల్ సెంటర్ నుంచి అడుగుతారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల అధికారులు, పోలీసు అధికారులతో కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లాల వారీగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రను నియమించారని, మే 10న ఆయన జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన విజ్ఞాపనలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, అందుకు అందరూ బాధ్యత వహించాలని ఆదేశించారు.

'ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు

జిల్లా స్థాయిలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఒక అధికారి, జిల్లా పోలీస్ కార్యాలయంనుంచి ఒక ఇన్‌స్పెక్టర్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఆడిట్ విభాగంలో ఉంటారని, వారినుంచి ఫోన్‌వస్తే వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఒక ఆర్జీదారు పలుమార్లు ఒక సమస్య పరిష్కారం కోసం రాకూడదని, అందుకు పక్కాగా నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్.కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ వాణిజ్య, రవాణా అధికారి ఎల్. అశోక్ కుమార్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమయుక్తంగా క్షీరాధివాసం


ఆలయగోపురంపై అభిషేకం చేస్తున్న దృశ్యం

- నేడు విగ్రహ ప్రతిష్ట
- మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం రేపు

సీతంపేట: టీటీడీ ఆధ్వర్యంలో సీతంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహాసంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆగమ యుక్తంగా మంగళవారం క్షీరాదివాసం నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల మధ్య విమాన కలశస్థాపన, బింబస్థాపన (విగ్రహ ప్రతిష్ఠ) చేయనున్నారు. ఈనెల 4న ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు వృషభలగ్నంలో మహాసంప్రోక్షణ నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా టీటీడీ ఆగమసలహాదారు మోహనరంగాచార్యులు మాట్లాడుతూ బింబశుద్ధి కోసం క్షీరాదివాసం నిర్వహించామని తెలిపారు. శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలకు గోవు పాలతో అభిషేకం చేశామని చెప్పారు. ఆలయ విమానగోపురం, ధ్వజస్తంభాలను అద్దంలో చూపించామన్నారు. అంతకుముందు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం నైతిక పూజలు చేసినట్లు తెలిపారు. ప్రచార రథం ద్వారా పరిసర గ్రామాల్లో ఆలయ మహాసంప్రోక్షణ గురించి భక్తులకు తెలియజేసేలా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బలద గ్రామం నుంచి శ్రీరామలింగేశ్వర భజన బృందం, పాలకొండ నుంచి శ్రీసంపత్‌వినాయకబృందం, సింగన్నవలసకు చెందిన శ్రీసీతారామ భజన బృందం, తుమరాడ నుంచి శ్రీ వెంకటేశ్వరస్వామి నామసంకీర్తన బృందం, చెక్కభజన చేశారు. బొబ్బిలి సీతారామ భజనబృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ, అసిస్టెంట్ లలితామణిలు కార్యక్రమ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కంకణ భట్టార్ శేషాచార్యులు, డిప్యూటీఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఈఈ సుధాకర్, ఏఈవో రమేష్, డిప్యూటీ ఈఈ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన గుర్రం, ఎడ్ల పరుగు పందెం


బురదలో దౌడు తీస్తున్న గుర్రం


బురదను సైతం లెక్క చేయకుండా పరుగు తీస్తున్న ఎడ్ల బండి

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో శ్రీ సత్యవమ్మ పేరంటాలు ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి గుర్రం, ఎడ్ల పరుగు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో విశాఖ, ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 18 జతల ఎడ్లు,17 గుర్రాలు పాల్గొన్నాయి.విజయనగరం డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు పోటీలకు రిఫరీగా వ్యవహరించారు. ఎడ్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానంలో అనకాపల్లి జిల్లా లెక్కలివానిపాలెం పైడిమాంబ ఎడ్లు, ద్వితీయ స్థానంలో వేపాడ మండలం వల్లంపూడికి చెందిన శ్రీ సిద్ధి వినాయక ఎడ్లు, తృతీయ స్థానంలో అనకాపల్లి జిల్లా ఎం.కోటపాడు గ్రామానికి చెందిన పాసల శ్రీను ఎడ్లు నిలిచాయి. వాటికి వరుసగా రూ 20వేలు,18వేలు,16 వేలు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే గుర్రం పరుగు పందెం పోటీల్లో ఎల్.కోట మండలం తలారికి చెందిన గుమ్మడి సత్యనారాయణ (వైఎస్సార్‌సీపీ ఎల్.కోట మండల అధ్యక్షుడు)కు చెందిన జ్వాలా, సాయివిరాట్ గుర్రాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, విశాఖకు చెందిన నవీన్ జ్వాలాగుర్రం తృతీయ స్థానంలోను నిలిచాయి. గెలుపొందిన గుర్రం యజమానులకు వరుసగా రూ. 20వేలు,18 వేలు,16 వేలు నగదు బహుమతులు అందజేశారు. ముందుగా సత్యవమ్మ పేరంటాలిని మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎస్.కోట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా ప్రేమ్‌కుమార్

- విజయనగరం డీఈఓ లింగేశ్వరరెడ్డికి ఆర్‌జేడీగా అదనపు బాధ్యతలు


మన్యం జిల్లా ఇన్‌చార్జి డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా ఎన్.ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా ఎలమంచిలి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయనను పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. ఈ బాధ్యతలతో పాటు జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసరుగా పనిచేస్తున్న పి.బ్రహ్మాజీరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ అసిస్టెంట్ డైరెక్టరుగా పోస్టింగ్ వచ్చింది. పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టరు (ఆర్‌జేడీ) జ్యోతికుమారి ఈనెల 12వ తేదీ వరకూ సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) బి.లింగేశ్వరరెడ్డికి ఆర్‌జేడీగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు శ్రీనివాస్


ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెకింగ్‌లో కానూరు శ్రీనివాస్

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట గ్రామానికి చెందిన కానూరు శ్రీనివాస్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో పాల్గొన్నాడు. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాస్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెకింగ్ యాటిట్యూడ్‌లో 14 రోజుల్లో 18,513 అడుగులు ఎత్తు వరకు వెళ్లాడు. అక్కడ జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

6న రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్యకళాశాల కోవిడ్ అసిస్టింట్ వీఆర్‌డీఎల్ ల్యాబ్, నెల్లిమర్ల మిమ్స్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి ఈ నెల 6న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

ప్రాధాన్యతా భవనాలు పూర్తికావాలి

పార్వతీపురం: ప్రాధాన్యతా భవనాలు త్వరగా పూర్తి కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మండల అధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధిహామీ పథకంలో రూ.12.37 కోట్లు చెల్లింపు జరిగిందన్నారు. అందులో ప్రాధాన్యతా పనులకు రూ.7.87కోట్లు, ఇతర పనులకు రూ.4.50 కోట్ల చెల్లింపులు జరిగాయని, ఏప్రిల్ 28నాటికి అప్‌లోడ్ చేసిన బిల్లులకు మే 8వ తేదీనాటికి చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో 1.32 కోట్ల పనిదినాలు లక్ష్యంగా ఉందని, ఏప్రిల్‌లో 18లక్షల పనిదినాలు చేయాలని, మే నెలలో 34 లక్షలు పనిదినాలు చేయాలని స్పష్టం చేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పార్వతీపురం మండలాలు లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నాయని అసహనం వెలిబుచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమానికి అవసరమయ్యే చర్యలు ప్రారంభించాలని సూచించారు. గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీజీ.కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ రఘురాం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ కోవిడ్ రిలీఫ్ ఫండ్ మంజూరు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాకు ఎమర్జెన్సీ కోవిడ్ రిలీఫ్ ఫండ్ కింద ప్రభుత్వం రూ.3.62 కోట్లు మంజూరు చేసిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. పార్వతీపురం మండలం చినబొండపల్లి పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. కోవిడ్ జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కోవిడ్ రిలీఫ్ ఫండ్ కింద ఒక్కో పీహెచ్‌సీకి రూ.9.8 లక్షలు చొప్పున జిల్లాలోని మొత్తం 37 పీహెచ్‌సీలకు రూ.3.26 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ పీహెచ్‌సీలో అదనంగా ఆరుపడకల ఎమర్జెన్సీ వార్డుల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

బైక్, ఆటో ఢీకొని పలువురికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: సీతానగరం మండలం జానుమల్లు వలస గ్రామానికి చెందిన వై. సింహచలంతో పాటు మరో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సింహాచలం, మరో ఇద్దరు స్నేహితులు దళాయివలసలో గ్రామదేవత పండగ చూసుకుని ద్విచక్రవాహనంపై సొంతగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ద్విచక్ర వాహనంపై వారు వెళ్తుండగా దళాయివలసనుంచి జానుమల్లువలస వెళ్తున్న ఆటో దళాయివలస సమీపంలో వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురితోపాటు ఆటోడ్రైవర్, ఆటోలో ఉన్న వ్యక్తులు చెల్లాచెదురుగా పడిపోయారు. అనంతరం క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

సిమ్మెంట్ దిమ్మ తగిలి వ్యక్తికి..

గంట్యాడ: బైక్‌పై వస్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటకు చెందిన మెండ రామచంద్రరావు ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా మంగళవారం ఎస్.కోట నుంచి బైక్‌పై విజయనగరం వస్తుండగా మండలంలోని నరవ ఏఎంజీ కాలనీ వద్ద విజయనగరం నుంచి వస్తున్న కారు సిమెంట్ దిమ్మను ఢీకొట్టడంతో అది రామచంద్రరావు కుడి కాలిపై పడగా కాలు విరిగింది. దీంతో స్థానికులు అంబులెన్సులో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి..

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి సెంటర్ వద్ద మంగళవారం బైక్ ఢీకొనడంతో వృద్ధుడు జి.చక్రపాణి గాయాలపాలయ్యాడు. తన స్వగ్రామమైన హడ్డుబంగి వద్ద వృద్ధుడు రోడ్డు దాటుతుండగా కొత్తూరు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న నరసమ్మ

పార్వతీపురం: భర్త మందలించడాని మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు పార్వతీపు రం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం డీకే.పట్నానికి చెందిన డి.నరసమ్మను భర్త నాగ రాజు మందలించడంతో మనస్తాపానికి గురై 20 పారాసిటమాల్ మాత్రలను మింగేసింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ద్విచక్ర వాహనంపై ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.